సాక్షి నంద్యాల

శనివారం : 2 : డిసెంబర్ : 2023



భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి సహస్రనామ పూజలు చేపట్టారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం గుంటూరుకు చెందిన అజయ్‌కుమార్ రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. దాతకు జ్ఞాపికను అందజేసి సత్కరించారు.



వైభవంగా పల్లకీసేవ

మహానంది: క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. ఈఓ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.

న్యూస్‌రీల్

4న జిల్లాకు ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకర్‌రావు ఈనెల 4వ తేదీన జిల్లాలో పర్యటించనున్నట్లు జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజునాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేదీ శ్రీశైలం చేరుకుని చెంచులతో సమావేశం అనంతరం తుమ్మలబైలు గ్రామంలో చెంచు గిరిజనులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఆయన వెంట కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ పాల్గొంటారన్నారు.


నిలిచిన రిజిస్ట్రేషన్ సేవలు



నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

నంద్యాల(అర్బన్): రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోని ఆధార్ సేవల్లో అంతరాయం ఏర్పడి ఈ-కేవైసీలు పనిచేయకపోవడంతో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. ఈ-కేవైసీలు పని చేయకపోవడంతో రిజిస్ట్రేషన్‌ల కోసం వచ్చిన ప్రజలు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఉదయం నుంచి రిజిస్ట్రేషన్లు జరుగకపోవడంతో కొందరు కార్యాలయాల నుంచి వెనుదిరగాల్సి వచ్చింది. రిజిస్ట్రేషన్‌ల సమయంలో ఆధార్ కేవైసీ ఓపెన్ కాకపోవడంతోనే ఈ సమస్య తలెత్తినట్లు అధికారులు తెలిపారు.

కేసీ కాల్వకు 2,600 క్యూసెక్కులు విడుదల



కేసీలో నీటి ప్రవాహం

జూపాడుబంగ్లా: కర్నూలు-కడప కాల్వకు 2,600 క్యూసెక్కుల సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తుండగా రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 2,268 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు తెలిపారు. ఈ నీటిని నిప్పులవాగుకు 1,945 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌చానల్ కాల్వకు 289 క్యూసెక్కులు, ఏబీఆర్ కాల్వకు 34 క్యూసెక్కులు మళ్లిస్తున్నట్లు చెప్పారు. రైతులు రబీ సీజన్‌లో వరి సాగు చేసుకోకుండా కేవలం ఆరుతడి పంటలు మాత్రమే సాగుచేసుకోవాలని ఏఈ కోరారు. రైతులు నీటిని వృథాచేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టిడ్కో గృహాల పరిశీలన



టిడ్కో అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా

నంద్యాల(సిటీ): పట్టణ శివారులోని అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న టిడ్కో గృహ సముదాయాలను మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా శుక్రవారం పరిశీలించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పేదలందరికీ గృహాలను అందించేందుకు టిడ్కో గృహ సముదాయంలో ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ తదితర సదుపాయాలకు ప్రాధాన్యతఇవ్వాలని చెప్పారు. ఎంఈ రమణమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహమూర్తి, డీఈఈ శ్రీనివాసరెడ్డి, టిడ్కో డీఈ పవన్, ఏఈ వెంకటనాయక్ తదితరులున్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు బాసట

విభిన్న ప్రతిభావంతుల చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపి వారి కలలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శారీరక వైకల్యంతో బాధపడుతూ తోటిపిల్లతో సమానంగా చదువులేక తల్లడిల్లే చిన్నారుల బంగారు భవిత కోసం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ఫిజియోథెరపీ చేయించడం, పై చదువులు అభ్యసించేలా 10 మార్కులే ఉత్తీర్ణత కొలమానంగా చేయడం, సహిత విద్యను అందించేందుకు రిసోర్స్ పర్సన్లను, బాగోగులు చూసేందుకు ఆయాలను నియమించడంతో పాటు తాజాగా భవిత కేంద్రాల్లో అత్యాధునిక ట్యాబ్‌లను అందజేస్తోంది.

- భవిత కేంద్రాల్లో డిజిటల్ బోధన
- విద్యార్థులతో పాటు ఐఈఆర్టీ, ఐఈడీఎస్ఎస్‌లకు ట్యాబ్‌లు
- మొదటి విడతగా జిల్లాలో 233 పంపిణీ
- దివ్యాంగులకు అర్థమయ్యేలా 26 ప్రత్యేక యాప్‌లు
- వినియోగంపై సమగ్రశిక్ష ద్వారా శిక్షణ



నా కూతురిలో మార్పు చూస్తున్నా

మా బిడ్డ సుప్రజ పుట్టుకతోనే వినికిడి లోపం, పాక్షిక దృష్టి లోపం ఉంది. స్థానిక భవిత కేంద్రంలో ఉంటూ జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. ప్రభుత్వం జగనన్న అమ్మఒడితో పాటు అనేక ప్రోత్సాహకాలు అందిస్తోంది. తాజాగా ఎంతో విలువైన ట్యాబ్‌ను ఉచితంగా ఇవ్వడంతో ఎంతో ఉపయోగకరంగా మారింది. ఈ నాలుగేళ్లలో నా కూతురులో చాలా మార్పులు గమనిస్తున్నా. శ్రద్ధగా చదువుకునే ప్రయత్నం చేస్తోంది.

– తంద్రి వెంకటసుబ్బయ్య, దొర్నిపాడు

పాఠాలు బాగా అర్థమవుతున్నాయి

నేను పుట్టుకతోనే దివ్యాంగురాలిని. కళ్లు సరిగా కనిపించవు. జ్ఞాపక శక్తి ఉండదు. దీంతో భవిత కేంద్రంలో చేర్పించడంతో నాలుగేళ్లలో అక్కడ చేస్తున్న ఫిజియో థెరిపీ, వైద్య పరీక్షలు చేయడంతో కాస్త మెరుగైంది. మూడేళ్ల క్రితం హైస్కూల్‌లో చేరి చదువు కుంటున్నా. తాజాగా ప్రత్యేక ట్యాబ్ ఇవ్వడంతో పాఠాలు బాగా అర్థం అవుతున్నాయి. అందరి మాదిరిగానే నేను బాగా చదువుకుంటా. జగనన్న సహాయం చెప్పలేని ఆనందాన్నిస్తోంది. బతికున్నంత కాలం జగనన్నకు రుణపడి ఉంటా. – పద్మావతి, చింతకుంట





బనగానిపల్లె భవిత కేంద్రంలో వినికిడి లోపం ఉన్న చిన్నారికి స్పీచ్ థెరిపీ చేస్తున్న ఐఈఆర్టీ



ఆళ్లగడ్డ భవిత కేంద్రంలో దివ్యాంగులకు విద్యాబోధన చేస్తున్న ఐఈఆర్టీలు

ఆళ్లగడ్డ: భవిత కేంద్రాల నిర్వహణ గతంలో అస్తవ్యస్తంగా ఉండేవి. గత టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారులపై చిన్నచూపు చూసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి భవిత కేంద్రాలు దివ్యాంగులకు ఆదరువుగా నిలుస్తున్నాయి. జిల్లాలో 29 భవిత కేంద్రాల్లో 597 మంది ప్రత్యేక అవసరాల పిల్లలున్నారు. వీరందరినీ మానసికంగా, శారీరకంగా ఎదుగుల తీసుకురావాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది. మానసిక చిన్నారులకు రూ. 14 వేల విలువైన ఎంఆర్ కిట్లు, అత్యాధునిక హియరింగ్ మిషన్లు, ట్రై సైకిళ్లు, బైక్‌లు, మధ్యాహ్న భోజనంతో పాటు బస్ పాసులు, వారానికి ఒక రోజు ఫిజియో థెరిపీ, నడవలేని స్థితిలో ఉన్నవారికి ఇంటి దగ్గరే విద్య, వైద్య సేవలు, నెలనెలా గర్ల్స్ స్టైఫండ్ పేరిట రూ. 200, హోం బేస్డ్ అలవెన్స్‌గా రూ. 300, రీడర్స్ అలవెన్స్‌గా రూ. 300, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ రూ. 300, ఎస్కార్ అలవెన్స్ రూ. 300 నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. తాజాగా మూగ, చెవుడు, దృష్టిలోపం, పూర్తిగా కనబడని వారు సైతం సాధారణ విద్యార్థుల్లా ఉన్నత విద్యను చదవాలనే ఉద్దేశంతో ఆధునిక సాంకేతికతతో కూడిన 233 ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఇందులో ఐఈఆర్టీలకు 57, ఐఈడీఎస్ఎస్ (స్పెషల్ బీఈడీ చేసిన స్కూల్ అసిస్టెంట్లు) లకు 36, 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న 49 మంది దృష్టి లోపం , 91 మంది మూగ, చెవిటి విద్యార్థులకు అందించారు. ట్యాబ్‌లను ఎలా వినియోగించుకోవాలన్న అంశంపై ఇప్పటికే జిల్లాలోని ప్యాపిలి, డోన్ మండలాల నుంచి మండాలనికి పది మంది విద్యార్థులచొప్పున అనంతపురం ఆర్డీటీలో శిక్షణ కూడా ఇవ్వడం జరిగింది. త్వరలో మిగతా విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా ట్యాబ్‌లపై శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వెలుగులు నింపేలా కంటెంట్

ఆరు నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న దృష్టి, వినికిడి లోపాలు కలిగిన విద్యార్థులకు అనుగుణంగా ట్యాబ్‌లలో అత్యంత ఆధునికమైన కంటెంట్‌ను నిక్షిప్తం చేశారు. బీమై ఐస్, ఎన్ విజన్ ఆల్, గూగుల్ ట్రాన్స్‌క్రైబ్, గూగుల్ లుక్ అవుట్, డాక్స్, నీట్, జీ బోర్డు, నోట్ ప్యాడ్, గూగుల్ కీ తదితర ప్రత్యేకలు పొందు పరచడంతోపాటు అంధులకు, పాక్షిక అంధులు, బదిరులు, పాక్షిక బదిరులుకు వీలుగా టాక్ బ్యాక్ (ట్యాబ్‌ను ఏ వైపు ఉపయోగించిన స్పందించే యాప్) స్పోకెన్ అసిస్టెంట్ (శబ్ద సాంకేతికతల ద్వారా ట్యాబ్‌ను ఉపయోగించే యాప్, విజిబులిటి ఇఎన్స్‌మెంట్ (దృష్టిలోపం ఉన్నవారికి చిన్నచిన విషయాలను స్పష్టంగా చూపడానికి ఉపయోగించే యాప్), మిషన్‌ఏఐ, 'ఎన్' విజన్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే) తదితర ప్రత్యేకంగా రూపొందిచిన 26 యాప్‌లను ట్యాబ్‌లలో పొందు పరిచారు. ట్యాబ్‌లను ఇతర అవసరాలకు ఉపయోగించుకోకుండా ప్రత్యేక లాక్ సిస్టమ్‌ను పెట్టడం జరిగింది. ఒక్కో ట్యాబ్ విలువ రూ. 29 వేలు ఉండగా వీటికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కీ బోర్డు రూ. 8 వేల విలువ చేస్తోంది. మొత్తం కలిపితే ఒక్కో ట్యాబ్ విలువ రూ. 37 వేలు అవుతుంది.

జిల్లాలో భవిత కేంద్రాలు : 29	
విద్యార్థులు	597
ఐఈఆర్టీలు	57
ఐఈడీఎస్ఎస్‌లు	36
ఫిజియోథెరపిస్టులు	8
ఆయాలు	29
ట్యాబ్‌ల పంపిణీ ఇలా..	
ఐఈఆర్టీలకు	57
ఐఈడీఎస్ఎస్	36
వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు	91
దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు	49

దివ్యాంగ బాలలపై ప్రత్యేక శ్రద్ధ

ప్రతి దివ్యాంగుడు సకలాంగ విద్యార్థులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా భవిత కేంద్రాల్లో విద్యార్థులకు ఎంతో విలువైన ఆధునిక ట్యాబ్‌లు అందజేయడం జరిగింది. వారికి సులభంగా అర్థం అయ్యేలా ప్రత్యేక యాప్‌లను ఇన్‌స్టాల్ చేశారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు శిక్షణ అందజేస్తాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రఘురామిరెడ్డి, జిల్లా విలీన విద్య కో–ఆర్డినేటర్

ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాలటౌన్: ఎయిడ్స్ రహిత సమాజమే స్థాపనగా అందరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని టౌన్‌హాల్ వద్ద ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ హెచ్ఐవీ నివారణ అందరి ధ్యేయం కావాలన్నారు. వైద్యారోగ్య శాఖ విభాగం, స్వచ్ఛంద కార్యకర్తలు సంయుక్తంగా కృషి చేయాలన్నారు. జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ 'సంఘాన్ని నడిపించనివ్వండి' అనే నినాదంతో కొత్తగా ఏ ఒక్కరూ హెచ్ఐవీ బారిన పడకుండా చేయడం, ఎయిడ్స్ సోకిన వారిని ఎటువంటి వివక్ష లేకుండా సామూహికంగా కలుపుకుని జీవించడమే లక్ష్యంగా ఈ సంవత్సరం ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం అధికారి డాక్టర్ శాంతాబాయి మాట్లాడుతూ హెచ్ఐవీతో జీవించే వారిని ఆదరించి, హెచ్ఐవీ లేని సమాజాన్ని నిర్మించాలని, అందుకు యువత పూర్తి అవగాహనతో జీవించాలని కోరారు. ఎయిడ్స్ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. టౌన్ హాల్ నుంచి స్థానిక శ్రీనివాస సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ కోఆర్డినేటర్ జఫ్రుల్లా, సర్వజన ఆసుపత్రి సూరింటెండెంట్ వరప్రసాదరావు, మాజీ ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, ఏఓ చంద్రశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితా స్వచ్ఛీకరణపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ డా.మనజీర్ జిలానీ శామూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: జిల్లాలో ఓటరు జాబితా స్వచ్ఛీకరణపై ప్రత్యేక దృష్టి సారించి క్లైమ్‌లు క్లియర్ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వివరించారు. శుక్రవారం విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ముసాయిదా ఓటర్ల జాబితా సవరణలో భాగంగా నేటి వరకు పెండింగ్‌లో ఉన్న ఫారమ్‌లు, 18–19 యువ ఓటర్ల నమోదు, అనామిలిస్ పెండింగ్, ముసాయిదా జాబితాలో ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, రాజకీయ పార్టీల ఫిర్యాదులు పెండింగ్, ఎపిక్ కార్డుల జనరేషన్ – పంపిణీ, పీఎస్ఈలు, డీఎస్ఈలు, నోడల్ అధికారుల నియామకం తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ డిసెంబర్ 2, 3 తేదీలలో పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించే ప్రత్యేక శిబిరాలలో బీఎల్వోలు ఉదయం నుంచి సాయంత్రం వరకు తప్పనిసరిగా ఉండేలా కలెక్టర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లా నుంచి కలెక్టర్ డా.మనజీర్ జిలానీ, డీఆర్ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. డిసెంబర్ 9 లోపు పెండింగ్ దరఖాస్తులను పూర్తిగా పరిష్కరించాలని సూచించారు. బల్క్‌గా అందిన దరఖాస్తులపై కమిషన్ నిబంధనలను అనుసరించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఫారం-6,7,8 దరఖాస్తులు 15,610 పెండింగ్‌లో ఉన్నాయని, స్వీకరించిన క్లైమ్‌లన్నిటింటిని నాణ్యతతో త్వరితగతిన పరిష్కరించేందుకు నియోజకవర్గ ఎలక్ట్రోల్ అధికారులు, తహసీల్దారులకు తగు ఆదేశాలు జారీ చేశామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. ఇప్పటికే 173 మంది సెక్టోరల్, పోలీసు అధికారులను నియమించామన్నారు. జిల్లాలో ముఖ్యంగా 18, 19 సంవత్సరాల యువ ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. నంద్యాల నియోజకవర్గంలో 29వ పోలింగ్ కేంద్రంలో ఒకే ఇంటి నెంబర్‌లో 73 మంది ఓట్లు ఉన్న కారణంగా సంబంధిత బీఎల్ఓ సరైన విచారణ జరుపకపోవడం, నిధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సంబంధిత బీఎల్ఓను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్డీవోలు శ్రీనివాసులు, ఎం.దాసు, వెంకటరెడ్డి, ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సృష్టికి రక్ష శివపార్వతులు

- ప్రవచకులు గరికపాటి నరసింహారావు



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు

శ్రీశైలంటెంపుల్: ఆదిదంపతులైన శివపార్వతులు సృష్టిని కాపాడుతుంటారని మహాసహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణమాఢవీధిలోని నిత్యకళావేదికపై ప్రముఖ ప్రవాచకులు గరికపాటి ఆదిశంకరులు రచించిన భ్రమరాంబాష్టకంపై ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి ప్రవాచకులు, దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అర్చకస్వాములు, వేదపండితులు, అధికారులు జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం గరికపాటి తన ప్రవచనాన్ని వినిపిస్తూ..భక్తుడుని భగవంతుడు ఎల్లవేళలా రక్షిస్తుంటాడని అన్నారు. శివరాధన విశేషాలను వివరించారు. భక్తులు శివారాధనలో ఆత్మానందాన్ని పొందగలరన్నారు. అలాగే శివతాండవ విశేషాలను కూడా వివరించారు. ప్రవచనంలో భాగంగా శ్రీశైలక్షేత్ర ఆదిదేవతలైన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల నామవైభవం, లీలావైభవం, స్వామిఅమ్మవార్ల మహిమావిశేషాలు, శ్రీశైలక్షేత్ర ప్రాశస్త్యం మొదలైన అంశాలను వివరించారు. అలాగే భ్రమరాంబాష్టకంలోని ప్రత్యేకతలు, విశేషాలు మొదలైన అంశాలు తెలియజేశారు. ప్రవచనం ముగిసిన అనంతరం ప్రవాచకులను దేవస్థానం తరుపున వేదాశీర్వచనంతో స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందించి సత్కరించారు.

ఉమ్మడి జిల్లాలో 6 నుంచి సెంట్రల్ టీమ్ పర్యటన

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో నెలకొన్న కరువును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఈ నెల 6, 7 తేదీల్లో సెంట్రల్ టీమ్ పర్యటించనుంది. ఇందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి జిల్లా అధికారులకు సమాచారం అందింది. కరువు పరిశీలనకు రాష్ట్రానికి మూడు టీమ్‌లు వస్తుండగా ఒక టీమ్ జిల్లాలో పర్యటిస్తుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. కర్నూలు జిల్లాలో 26 మండలాలు ఉండగా తుగ్గలి, కర్నూలు రూరల్ మండలాలు మినహా మిగిలిన 24, నంద్యాల జిల్లాలో 6 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం గుర్తించింది. సెంట్రల్ టీమ్‌కు కర్నూలు రూరల్, తుగ్గలి, నంద్యాల జిల్లాలోని మరికొన్ని మండలాల్లో నెలకొన్న కరువు పరిస్థితిని వివరించనున్నారు.

తలుపు తట్టి.. పింఛన్ ఇచ్చి!



నందికొట్కూరు మండలం దామగట్ల గ్రామంలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి



మహానంది మండలం గోపవరంలో పెద్ద పుల్లారెడ్డికి ఫించన్ అందజేస్తున్న వలంటీర్ రమాదేవి



నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విశ్రాంతమ్మకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ శ్రీదేవి

- తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభం
- ఠంఛన్‌గా పింఛన్ అందడంపై లబ్ధిదారుల హర్షం
- జిల్లాలో 80.54 శాతం పంపిణీ పూర్తి

నంద్యాల(న్యూటౌన్): వైఎస్ఆర్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఉదయం నుంచే మొదలైంది. తెల్లవారకముందే తలుపు తట్టి పింఛన్ డబ్బులు అందజేయడంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మురిసి పోయారు. తమ బాధలు తెలుసుకుని ఠంఛన్‌గా ఒకటో తారీఖు పింఛన్ అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలును మరవలేమని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. డిసెంబర్ నెలకు సంబంధించి నంద్యాల జిల్లాలో 2,21,508 మంది పింఛన్‌దారులకు రూ.61.16 కోట్లు నగదును ప్రభుత్వం మంజూరు చేసింది. మొదటి రోజు శుక్రవారం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి జిల్లాలో 1,78,396 లబ్ధిదారులందరికీ పింఛన్ అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తు పింఛన్‌ను సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే 80.54 శాతం పంపిణీ పూర్తయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా ప్రతి నెల 1వ తేదీ ఉదయం నుంచే పింఛన్ పంపిణీ కొనసాగేలా చర్యలు చేపట్టిందన్నారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ కొనసాగుతుందని తెలిపారు.



కొలిమిగుండ్ల మండలం గొర్విమానుపల్లెలో శుక్రవారం తెల్లవారుజామున దివ్యాంగ చిన్నారి అఖిలను నిద్రలేపి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మహేంద్ర

అవ్వ ఆనందం



ఇక్కడ చిత్రంలో ఓ చేతిలో వైఎస్సార్ పింఛన్‌కానుక సొమ్ము, ఇంకో చేతో సీఎం జగనన్న చిత్రంతో కూడిన పింఛన్ బుక్‌ను ఆనందగా చూపుతున్న వృద్ధురాలు పేరు అచ్చమ్మ. దొర్నిపాడు మండలం డబ్ల్యూ గోవిందిన్నె వాసి. శుక్రవారం ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్ రామపుల్లయ్య పింఛన్ సొమ్ము రూ.2,750 ఇవ్వడంతో అవ్వ మనసారా నవ్వింది.

క్లుప్తంగా

అరటి పొలాల్లోకి ఎలుగుబంటి



అరటి పొలాల్లో కనిపించిన ఎలుగుబంటి

మహానంది: మహానంది ఆలయ పరిసరాల్లో కొన్ని రోజులుగా ఎలుగుబంటి సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తాజాగా శుక్రవారం మహానంది నుండి గాజులపల్లె వెళ్లే మార్గంలో ఉన్న టోల్ గేట్ సమీపంలోని అరటి తోటలో ఎలుగుబంటి కనిపించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అరటి పండ్లు తింటూ ఎలుగుబంటి కనిపించింది అని స్థానికులు తెలిపారు. ఎవరికీ ఎలాంటి ప్రాణహాని జరగక ముందే అటవీశాఖ అధికారులు స్పందించి పంట పొలాల్లో సంచరిస్తున్న ఎలుగుబంటిని బంధించి అడవిలో వదిలి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

13 నుంచి మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు వారై చదవడం, రాయడం వచ్చిన మహిళలకు ఉచిత భోజనం, హాస్టల్ వసతితో ఈ నెల 13 నుంచి 30 రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు 90007 10508 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రూ.4.65 లక్షల అపరాధ రుసుం వసూలు

కర్నూలు (న్యూటౌన్): అక్రమ రవాణాకు పాల్పడిన వాహనాలను సీజ్ చేసి వాటి నుంచి రూ.4.65 లక్షలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అనుమతి లేకుండా వేర్వేరు చోట్ల నాపరాయి, సున్నపురాయి, సిలికా, ఎర్రమట్టి తరలిస్తుండగా వాహనాలను సీజ్ చేసి, జరిమానాలు విధించామన్నారు.

లారీ ఢీ కొని ఆటో డ్రైవర్ మృతి



రంగస్వామి (ఫైల్)

బేతంచెర్ల: పట్టణం నుంచి డోన్‌కు వెళ్లే రహదారిలోని హరి పాలిష్ ఫ్యాక్టరీ వద్దరోడ్డు దాటుతుండగా లారీ ఢీ కొని ఆటో డ్రైవర్ బండారు రంగాస్వామి మృతి చెందాడు. ఏఎస్ఐ లింగమయ్య తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన బండారు రంగస్వామి ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం రాత్రి పని నిమిత్తం వెళ్లి హరి పాలిష్ ఫ్యాక్టరీ సమీపంలో రోడ్డు దాటుతుండగా లారీ ఢీ కొనడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు బండారు రంగస్వామిని(53) చికిత్స నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు బండారు ఉమాశంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు.

3న బండలాగుడు పోటీలు

జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామంలో ఈనెల 3వ తేదీన అంతరాష్ట్రస్థాయి ఎద్దుల ఆరుపండ్ల విభాగంలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు తర్తూరు సర్పంచ్ పెద్దముంతల నాగిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో సీతారాముల వారి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కష్టాలు కను'మరుగు'

- ప్రతి పాఠశాలలో బాలికలు, బాలురకు ప్రత్యేక టాయిలెట్స్
- వాటి శుభ్రతకు 1,741 మంది ఆయాల నియామకం
- హైస్కూళ్లలో నైట్‌వాచ్‌మెన్ల విధులు
- నాడు అసౌకర్యాలు.. నేడు సౌకర్యాలతో కొత్త కళ



శుభ్రంగా ఉన్న కోడుమూరు హైస్కూల్ ఆవరణం



పాఠశాలలో నిర్మించిన టాయిలెట్లు

కర్నూలు సిటీ: ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉండేవి. వాటిని శుభ్రం చేసేందుకు ప్రత్యేకంగా ఎలాంటి వ్యవస్థ ఉండేది కాదు. చాలా పాఠశాలల్లో విద్యార్థులతోనే తరగతి గదులను శుభ్రం చేయించేవారు. ఉపాధ్యాయులకు మాత్రమే ఉండే టాయిలెట్ల శుభ్రత సైతం అధ్వానంగా ఉండేది. వీటిని సైతం కొందరు విద్యార్థులతో శుభ్రం చేయించేవారు. బాలికలకు టాయిలెట్లు లేకపోవడంతో కంపచెట్ల చాటుకు వెళ్లాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. మన బడి నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలు సరికొత్త హంగులతో కళకళలాడుతున్నాయి.

అన్ని పాఠశాలలకు మరుగుదొడ్లు

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మొత్తం 1436 ఉన్నాయి. ఈ స్కూళ్లలో 2.67 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు దాదాపు అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించారు. రన్నింగ్ వాటర్‌తో కూడిన మరుగుదొడ్లు బాలురు, బాలికలకు వేర్వేరుగా ఉన్నాయి. వాటి శుభ్రతకు 1,741 మంది ఆయాలను నియమించారు. రాష్ట్ర ప్రభుత్వం పిల్లలను బడికి పంపిస్తున్నందుకు అమ్మ ఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లి ఖాతాల్లో ఏటా రూ.15 వేలు జమ చేస్తోంది. ఇందులో నుంచి కొంత నగదును తలిదండ్రుల అంగీకారంతో ప్రత్యేకంగా టాయిలెట్ నిర్వహణ ఫండ్ అని ఏర్పాటు చేశారు. ఇందులో నుంచి ఒక్కో ఆయాకు రూ.6 వేలు వేతనంగా ఇస్తున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతి స్కూల్‌కి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయాలను నియమించారు. మరుగుదొడ్ల శుభ్రతకు రసాయాలను సైతం ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. గతంలో ఉన్నత పాఠశాలల్లో ఉండే విలువైన వస్తువులకు రక్షణ ఉండేది కాదు. నేడు జిల్లాలోని 240 ఉన్నత పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్లను నియమించి, ప్రతి హైస్కూల్‌కు రాత్రి వేళల్లో రక్షణ ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

ప్రతి రోజూ శుభ్రం చేస్తున్నారు



జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మన బడి నాడు-నేడు కింద టాయిలెట్లు నిర్మించాం. ప్రతి రోజూ మూడు పూటలా శుభ్రం చేసేందుకు ప్రత్యేకంగా ఆయాలను నియమించాం. వీరికి నెలకు రూ.6 వేల రూపాయల వేతనం ఇస్తున్నాం. శుభ్రం చేసేందుకు రసాయాలను సైతం పంపిణీ చేశాం. – డాక్టర్ వి. రంగారెడ్డి, డీఈఓ

అన్ని స్కూళ్లలో టాయిలెట్లు నిర్మించాం



జిల్లాలో 1,436 స్కూళ్లలో మన బడి నాడు-నేడు పథకం కింద బాల, బాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు నిర్మించాం. గతంలో ఎప్పుడు కూడా ప్రభుత్వ బడుల్లో ఈ స్థాయిలో టాయిలెట్లు నిర్మించలేదు. తుగ్గలి మండలంలోని ఓ స్కూల్‌లో స్థలం లేకపోవడంతో నిర్మించలేదు.
– డా. కె వేణుగోపాల్, సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్

ఆహ్లాద వాతావరణం



ప్రభుత్వ పాఠశాలలు చాలా గొప్పగా ఉన్నాయి. టాయిలెట్లు సరికొత్తగా విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు నిర్మించారు. వీటిని శుభ్రం చేసేందుకు రూ.6 వేలు వేతనాలు ఇచ్చి ఆయాలను ఏర్పాటు చేశారు. స్కూల్ ఆవరణాలు సైతం శుభ్రం చేస్తుండడంతో ఆహ్లాద వాతావరణం ఉంది. ప్రతి రోజు ఆయాలు శుభ్రం చేసిన ఫొటోలు ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం.
– శ్రీనివాస యాదవ్, మీదివేముల హైస్కూల్ హెచ్‌ఎం, ఓర్వకల్లు మండలం

క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభం



ప్రాపర్టీ షో ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీలు, మేయర్, ఎమ్మెల్యేలు

కర్నూలు (టౌన్): నగరంలోని ఎస్‌టీబీసీ కళాశాల మైదానంలో శుక్రవారం క్రెడాయ్ ప్రాపర్టీ, బిల్డ్ టెక్ షో ప్రారంభమైంది. కర్నూలు, నంద్యాల ఎంపీలు డాక్టర్ సంజీవ్‌కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, హఫీజ్‌ఖాన్ అతిథులుగా హాజరై స్టాళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రెడాయ్ (కాన్ఫడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్, డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు పాపర్టీ షో నిర్వహిస్తారన్నారు. ప్రదర్శలో అన్ని అనుమతులు కలిగిన ప్లాట్లు విక్రయిచండం శుభపరిణామమన్నారు. ప్రాపర్టీషోతో పాటు కార్ ఎక్స్‌పో కూడా ఉంటుందన్నారు. ఇళ్లు, ప్లాట్లు, ఇంటిస్థలాలు, కార్ల కొనుగోలుకు సంబంధించి రుణాలు అందించేందుకు అన్ని బ్యాంకుల అధికారులు ఇక్కడే అందుబాటులో ఉన్నారన్నారు. ప్రజలు ఇటువంటి ప్రదర్శనలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కుడా వైస్ చైర్మన్ ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి, కమిషనర్ భార్గవ్ తేజ, క్రెడాయ్ ప్రాపర్టీ షో కన్వీనర్ నగరూరు శ్రీనివాస్, అధ్యక్షులు సాయిరామిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కర్నూలు: కర్నూలు శివారులోని జగన్నాథగట్టు పోలీసు శిక్షణా కేంద్రం(పీటీసీ)లో రాయలసీమ జోన్ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పలువురు పోలీసులు రాష్ట స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇంటర్ అపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్(ఐసీజేఎస్), క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్ (సీసీటీఎన్ఎస్), జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్ఆర్‌సీ) అంశాలపై రాయలసీమ రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ నేతృత్వంలో గత రెండు రోజులుగా ఈ పోటీలను నిర్వహించారు. ఐసీజేఎస్, సీసీటీఎన్ఎస్, జాతీయ మానవ హక్కుల కమిషన్ పరిరక్షణ విభాగాలకు సంబంధించి వాటి ప్రాధాన్యతలపైన తెలుగు, ఆంగ్ల భాషలలో చర్చా వేదికలు జరిగాయి. పరిజ్ఞానంతో పట్టు సాధించిన విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం పరిపాలనా విభాగాధిపతి, ప్రిన్సిపల్ ఏఎస్పీ సర్కార్, న్యాయ కళాశాల ప్రిన్సిపల్ శివాజీరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు.

జోనల్ స్థాయి విజేతల జట్టు

జోనల్ స్థాయి విజేతల జట్టుగా కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, ఖలీల్ బేగ్, తాలూకా పోలీస్‌స్టేషన్ మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్ శోభారాణి, అన్నమయ్య జిల్లా ఆర్ఎస్ఐ జాఫర్, సైబర్ క్రైం సబ్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, నంద్యాల జిల్లా గోస్పాడు పోలీస్‌స్టేషన్ మహిళా పోలీస్ భారతి, ఉలిందకొండ పోలీస్ స్టేషన్ మహిళా పోలీస్ లక్ష్మీదేవి, నందికొట్కూరు పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ శివకుమార్ విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఈ సందర్భంగా వీరిని అభినందించారు.

పెద్దాసుపత్రికి వైద్యపరికరాల విరాళం



వైద్యపరికరాలను అందుకుంటున్న అధికారులు, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జనరల్ మెడిసిన్ విభాగానికి అత్యవసర వైద్యసేవల కోసం వైద్యపరికరాలను ఉషారాణి కుటుంబసభ్యులు విరాళంగా అందజేశారు. కోవిడ్ సమయంలో లక్ష్మీబాయి అనే రోగికి చేసిన సేవలకు గాను ఆమె కుమార్తె అయిన ఉషారాణి(గుంతకల్ నివాసి) లక్ష రూపాయల విలువజేసే వైద్యపరికరాలను ఆసుపత్రికి అందజేశారు. వీటిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చేతుల మీదుగా జనరల్ మెడిసిన్ విభాగం వైద్యులు అందుకున్నారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ పి. సుధాకర్, జనరల్ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్లు డాక్టర్ డి. శ్రీరాములు, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ లక్ష్మీబాయి, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ దమామ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లా వర్సిటీ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కల్లూరు: న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కల్లూరు మండలం లక్ష్మీపురం సర్వే నం 793–1ఎలో 100 ఎకరాలను జేసీ నారపురెడ్డి మౌర్య శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. లా వర్సిటీ ఏర్పాటుకు త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు, తహసీల్దార్ రమేష్‌బాబు, పోలీస్ హౌసింగ్ బోర్డు అధికారులు పాల్గొన్నారు.

పాణ్యంలో ఇద్దరిపై కత్తితో దాడి

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలో ఇద్దరిపై కత్తితో దాడి చేసినట్లు ఎస్ఐ అశోక్ శుక్రవారం తెలిపారు. పాణ్యం గ్రామానికి చెందిన గణేష్‌కు గద్వాల్‌కు చెందిన తులసితో వివాహమైంది. భర్త గణేష్ కొడుతున్నాడని గురువారం రాత్రి తల్లి జయలక్ష్మికి తులసి ఫోన్ చేసింది. దీంతో జయలక్ష్మి తన కుమారుడు అరుణ్‌తో కలిసి కారులో పాణ్యానికి వచ్చి కుమార్తెతో మాట్లాడుతుండగా గణేష్ వారిపై కత్తితో దాడి చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అరుణ్‌కు ఛాతీపై, జయలక్ష్మికి పొట్ట, ముఖంపై గాయాలయ్యాయన్నారు. కేసు నమోదు చేసి, బాధితులను చికిత్స నిమిత్తం శాంతిరాం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ చెప్పారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్

మద్దికెర: బోయ గోపాల్ హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రిజ్వాన్ మహమ్మద్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. చిప్పగిరి మండలం నంచర్ల గ్రామానికి చెందిన కంప్లి లాలెప్ప భార్య కంప్లి లింగమ్మతో అదే గ్రామానికి చెందని బోయ గోపాల్‌కు వివాహేతర సంబంధం ఉండేది. విషయం తెలిసిన లాలెప్ప తన భార్య హెచ్చరించాడు. అయినా ఆమె వినలేదు. దీంతో గ్రామంలో తన మర్యాద పోతోందని బోయ గోపాల్‌ను హతమార్చేందుకు పథకం పన్నాడు. భార్యతోనే గోపాల్‌ను పొలానికి రావాలని చెప్పించారన్నారు. పొలానికి వచ్చిన గోపాల్‌ను గత నెల 26 వతేదీన కంప్లి లాలెప్ప, కంప్లి శివ, కంప్లి లాలెమ్మ పథకం ప్రకారం బండిగూటంతో కొట్టి చేతులతో గాయపరచడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మోటారు సైకిల్, గూటాన్ని స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను రిమాండు నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు తహసీల్దార్లు, బీఎల్ఓకు షోకాజ్ నోటీసులు

నంద్యాల: ఓటరు జాబితాలో సవరణలు, నమోదుకు సంబంధించి విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఇద్దరు తహసీల్దార్లకు షోకాజ్ నోటీస్‌లు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల, దొర్నిపాడు మండలాల్లో ఒకే ఇంట్లో 10 ఓట్లకు మించి ఉన్న కుటుంబాలలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల తొలగింపుకు తగు చర్యలు తీసుకోవడంలో అశ్రద్ధ వహించిన నంద్యాల తహసీల్దార్ శ్రీనివాసులు, దొర్నిపాడు తహసీల్దార్ జయప్రసాద్‌కు సంజాయిషీ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. అలాగే నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో 29వ పోలింగ్ కేంద్రం బీఎల్ఓ పెద్ద నాగమల్లేష్ ఒకే ఇంటి నెంబర్‌లో 73 మంది ఓట్లు ఉన్న కారణంగా... సంబంధిత బీఎల్ఓ సరైన విచారణ చేయకపోవంతో షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు.

శ్రీగిరిలో కార్తీక దీపారాధన



కార్తీక పూజలు నిర్వహిస్తున్న మహిళలు

శ్రీశైలంటెంపుల్: కార్తీకమాస మూడవ శుక్రవారాన్ని పురస్కరించుకుని భక్తులు శ్రీగిరిలో దీపారాధన చేసుకున్నారు. శుక్రవారం వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, దేవస్థానం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర మాఢవీధిలో దీపారాధన చేశారు. పలువురు భక్తులు లక్షదీపాలను వెలిగించి, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

స్వామి శరణం.. నియమాల తోరణం

- ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైన అయ్యప్ప స్వామి దీక్షలు



భక్తులకు మాల వేస్తున్న పూజారి బాలస్వామి

కర్నూలు కల్చరల్: సూర్యోదయంలోగా స్నానాలు... పూజలు.. ఉపవాసాలు... ఉమ్మడి కర్నూలు జిల్లాలో అయ్యప్ప స్వామి దీక్షలు ప్రారంభమయ్యాయి. అయ్యప్ప మాల వేసిన వారు 41 రోజుల పాటు స్వామికి ఆత్మనివేదన చేసుకుంటూ నిత్యం స్వామి శరణు ఘోషతో పూజిస్తారు. మనసారా అయ్యప్ప స్వామిని కొలవడమే ఈ దీక్ష పరమార్థం. జిల్లాలో ఏటేటా దీక్షాధారుల సంఖ్య పెరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో ఏటా సుమారు 60 వేల మంది వరకు దీక్ష స్వీకరిస్తున్నారు.

దీక్షా విధానమిదీ..

అయ్యప్పస్వామి మాల ధరించాలనుకునేవారు మూడు రోజుల ముందు నుంచే పవిత్రంగా ఉండాలి. మద్యం, మాంసం తదితర దురలవాట్లకు దూరంగా ఉండాలి. ఆరుసార్లు శబరి యాత్రకు బయలుదేరి మకర జ్యోతిని దర్శించుకున్న గురుస్వామితో మాల స్వీకరించాలి. మాల స్వీకరించే ముందు బ్రహ్మదేవుని చందనంగా, శివుడిని విభూదిగా, విష్ణువును కుంకుమ రూపంలో భావించి నుదుటిపై దిద్దుకోవాలి. కుటుంబంలో తల్లిదండ్రులు మరణిస్తే ఏడాది పాటు మాల ధరించరాదు. భార్య మరణిస్తే ఆరు నెలల పాటు దీక్షకు దూరంగా ఉండాలి.

నియమాలివీ..

- మాల ధరించిన స్వాములంతా నిత్యం బ్రహ్మ ముహూర్తంలో నిద్రలేచి చన్నీటి స్నానమాచరించి సూర్యోదయం కాకముందే పూజను ముగించాలి. తిరిగి సాయంత్రం చన్నీటి స్నానం చేసి సంధ్యా పూజ చేయాలి.
- భిక్షాటన చేసిన బియ్యంతోనే స్వయంగా వండుకోవాలి. అలా సాధ్యం కాని పక్షంలో 41 రోజుల మండల దీక్ష పూర్తయ్యాక ఇరుముడి కట్టుకునేందుకు ముందు ఐదు ఇళ్లలో భిక్షాటన చేయవచ్చు.
- సూర్యుడు నెత్తి మీదకు వచ్చాక మధ్యాహ్నం 3 గంటల లోపు భిక్ష చేయాలి. ఏక భుక్తాన్ని పాటించాలి. మధ్యాహ్నభిక్ష వరకు ఎలాంటి అల్పాహారం కానీ, ఆహార పదార్థాలు కానీ స్వీకరించరాదు. పాలు, ఫలహారం స్వీకరించవచ్చు. సాయంత్రం పూజ అనంతరం అల్పాహారాన్ని కొద్ది మొత్తంలో స్వీకరించాలి.
- కటిక నేలపై నిద్రిస్తూ ఉల్లి, వెల్లుల్లి లేకుండా సాత్విక ఆహారం తీసుకోవాలి.
- మాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తీయకుండా నిత్యం ఏదో ఒక దేవాలయాన్ని దర్శించాలి. పరనింద, అబద్ధాలు మాట్లాడకుండ మాల వేసిన స్వాముల పెదవులపై ఎల్లప్పుడూ స్వామియే శరణం అయ్యప్ప... అనే మంత్రం పఠిస్తూ ఉండాలి.
- శక్తికొద్దీ ఒక్కసారైనా ఐదుగురు అయ్యప్పలకు భిక్ష పెట్టాలి.
- హింసాత్మక చర్యలు, దుర్భాషలాడటం, అసత్యం పలకడం చేయరాదు.
- నల్లని దుస్తులు ధరించి కాళ్లకు చెప్పులు లేకుండా తిరుగుతూ అయ్యప్పలందరినీ గౌరవించాలి.



సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయం

అన్న ప్రసాదం

ఉమ్మడి జిల్లాలో ఏటా వేలాది మంది భక్తులు అయ్యప్ప స్వామి దీక్ష స్వీకరిస్తారు. సొంతంగా వండుకోవడం సాధ్యం కాని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల కోసం అయ్యప్ప స్వామి ఆలయ కమిటీలు అన్నదానం నిర్వహిస్తున్నాయి. ఏటా కార్తీక మాసం మొదలుకొని మకర జ్యోతి ముందు రోజు వరకు అన్నదానం చేస్తారు.

- జిల్లాలో మొట్టమొదట చాగలమర్రిలో అయ్యప్పస్వామి ఆలయంలో దీక్షా పరులకు అన్నదానం చేయడం ప్రారంభించారు. ఇక్కడ రోజు సుమారు 500 మంది భిక్షను స్వీకరిస్తారు. సరాసరి సంవత్సరానికి 50 వేల మంది అయ్యప్పలకు అన్నదానం జరుగుతుంది.
- కర్నూలు సప్తగిరి నగర్‌లోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో గత 20 సంవత్సరాలుగా అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరుగుతోంది. ఇక్కడ రోజుకు సరాసరి 1,200 మంది భిక్షను స్వీకరిస్తారు. సుమారు 70 రోజులు పాటు అన్నదానం జరుగుతుంది. దాదాపు రూ. 60 లక్షల వరకు ఖర్చు అవుతుందని అయ్యప్ప అన్నదాన కమిటీ ప్రతినిధులు పేర్కొంటున్నారు.
- ఆదోని ఎస్కేడీ కాలనీలో అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక మాసం మొదలు కొని అయ్యప్ప దీక్షా భక్తులకు అన్నదానం చేస్తారు. రోజుకు సుమారు 200 మంది వరకు భిక్ష స్వీకరిస్తారు.
- నంద్యాలలో పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గత 19 సంవత్సరాల నుంచి అన్నదానం చేస్తున్నారు. రోజుకు సుమారు 600 మంది భిక్షను స్వీకరిస్తారు.
- డోన్ గాంధీ నగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప భక్తులకు అన్నదానం చేస్తున్నారు. రోజుకు సుమారు 200 మంది వరకు స్వాములు భిక్షను స్వీకరిస్తుంటారు.
- ఎమ్మిగనూరు ఇందిరాగాంధీ కాలనీలోని అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదాన ప్రసాదం వితరణ చేస్తున్నారు. రోజుకు 200 మంది వరకు భిక్షను స్వీకరిస్తుంటారు.
- పత్తికొండలో రోజుకు 150 మంది భక్తులు భిక్షను స్వీకరిస్తారు.

దర్శనానికి ఇలా..

www.sabarimala.com అనే వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకొని దర్శనం టికెట్ పొంద వచ్చు. వెబ్‌సైట్ క్లిక్ చేయగానే శబరిమల దేవ స్థానం పేజీ వస్తుంది. వర్చువల్ పేజ్ కాలమ్‌లో నమోదు చేసుకొనే వారి ఈమెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ నమోదు చేయాలి. వెంటనే ఈమెయిల్‌కు కోడ్ వస్తుంది. ఆ నంబర్ సహాయంతో రెండో లాగిన్‌లోకి వెళ్లాలి. ఇందులో వారు ఇచ్చిన కోడ్ నంబర్ పేర్కొంటే కావాల్సిన వివరాలు నమోదు చేసి టికెట్ పొందమని సూచిస్తుంది. ఆన్‌లైన్‌లో టికెట్ పొందిన వారు దాన్ని ప్రింట్ తీసుకోవాలి. శబరిమలకు వెళ్లేటప్పుడు టికెట్‌తో పాటు ఆధార్ కార్డ్‌ను వెంట తీసుకెళ్లాలి. పంబాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో వీటిని చూపిస్తే దేవస్థానం సీల్ వేసిన ఒక స్లిప్‌ను ఇస్తారు. శరంగుత్తి దాటిన తరువాత ఆన్‌లైన్ టికెట్ పొందిన వారికి ప్రత్యేక మార్గం ద్వారా ఆలయానికి వెళ్లవచ్చు.

మార్పు వస్తుంది



నేను జీవితంలో ఒకసారి అయ్యప్ప మాల వేద్దామనుకొని వేశాను. వేసుకున్న తరువాత నాలో చాలా మార్పు వచ్చింది. అప్పటి నుంచి క్రమం తప్పకుండా దీక్ష స్వీకరిస్తున్నాను. ప్రస్తుతం 30వ సారి మాల వేసుకున్నాను. అయ్యప్పను ఎంత కొలిస్తే మనకు అంత పుణ్యం సిద్ధిస్తుంది. సేవాగుణం అలవడుతుంది. పది మందికి మంచి చేయాలనే భావన కలుగుతుంది. – శేఖర్‌రెడ్డి, గురుస్వామి

ప్రశాంతంగా ఉంటుంది



అయ్యప్ప దీక్షలో ఉన్నన్ని రోజులు జీవితం ప్రశాంతంగా ఉంటుంది. ఎల్లప్పుడు భగవంతుని సన్నిధానంలో ఉన్న భావన కలుగుతుంది. ముఖ్యంగా క్రమశిక్షణ జీవితం అలవడుతుంది. సేవాభావన కలుగుతుంది. అయ్యప్పను నిష్టతో పూజించినప్పుడే ఫలితం ఉంటుంది. కార్తీక మాసం ప్రారంభమైందంటేనే మాల వేసుకోవాలని ఆలోచన వస్తుంది. తొమ్మిదిసార్లు మాలధారణలో నాలో చాలా మార్పులు వచ్చాయి. – లక్ష్మణ్, గురుస్వామి